క్లుప్తంగా

క్రీడలతో ఉల్లాసం



చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తున్న తోట పద్మావతి, లండా రమణ

అల్లిపురం: క్రీడలు పిల్లల్లో ఉత్సాహం, ఉల్లాసాన్ని నింపుతాయని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. జీవీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో శిబిరాన్ని బుధవారం ఆమె సందర్శించారు. పిల్లలకు జీవీఎంసీ అందజేస్తున్న పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్పొరేటర్ మాట్లాడుతూ పిల్లలు ఇటువంటి శిబిరాలను వినియోగించుకోవాలని సూచించారు. తల్లిదండ్రులు కూడా పిల్లలను ప్రోత్సహించి ఏదో ఒక క్రీడను వారు నేర్చుకునేలా చేయాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు లండా రమణ, శిక్షకుడు చంటి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా



వెలంపేటలో వృథాగా పోతున్న తాగునీరు

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు వెలంపేటలో తాగునీరు వృథాగా పోతోంది. ఇటీవల ఈ ప్రాంతంలో విద్యుత్ లైన్ల కోసం తవ్విన గోతులు వల్ల పైప్‌లైన్లు శిథిలమయ్యాయి. దీంతో ఈ సమస్య ఏర్పడింది. పాతనగరం వైపు కూడా ఇదే లైను వెళ్లడంతో అక్కడ నీటి సరఫరా తక్కువగా అవుతోందని నివాసులు చెబుతున్నారు. వెలంపేట వద్ద మూడు రోజులుగా నీరు వృథాగా పోతున్న విషయంపై సంబంధిత తాగునీటి సరఫరా అధికారులకు ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడంలేదని అంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని వెలంపేట వాసులు కోరుతున్నారు.

సమ్మర్ క్యాంప్ పిల్లలకు పౌష్టికాహారం పంపిణీ



చిన్నారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు

జగదాంబ: సమ్మర్ క్యాంప్‌లో భాగంగా ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ క్రికెట్ స్టేడియంలో వివిధ క్రీడల్లో శిక్షణ పొందుతున్న చిన్నారులకు బుధవారం 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల క్రీడల్లో రాణించాలన్నారు. దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎందరో ప్రముఖులు ఒకప్పుడు గల్లీల నుంచి వచ్చిన వారేనన్నారు. అటువంటి వారందరినీ దృష్టిలో పెట్టుకుని క్రీడల్లో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. జీవీఎంసీ అధికారులు పాల్గొన్నారు.

బహిరంగ చర్చకు సిద్ధమా?

మహారాణిపేట: తిరుపతిలో గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోందని, రవాణాను నిరోధించడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు విమర్శించారు. టీడీపీ కార్యాలయంలో బుధవారం మహానాడు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మీడియాతో గంటా మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ అధికారం చేపట్టి నాలుగేళ్లయిందని, ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులపై బహిరంగ చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. ప్రత్యేక హోదా, పోలవరం, విశాఖ రైల్వే జోన్ అంశాలను పక్కన పెట్టి 'నవరత్నాలు' అని తెరపైకి తెచ్చారన్నారు. సంపూర్ణ మద్యపాన నిషేధంపై మాట తప్పారన్నారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వామ్మో.. విద్యుత్ తీగలు..!



30వ వార్డు కుమ్మర వీధిలో వేలాడుతున్న కరెంట్ తీగలు



36వ వార్డు అగ్రహారం వీధిలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

- పాతనగరంలో నేటికీ వేలాడుతున్న కరెంట్ వైర్లు
- అందుబాటులోకి రాని భూగర్భ విద్యుత్ లైన్లు
- భయాందోళనల్లో నివాసులు

డాబాగార్డెన్స్: పేరొందిన పాత నగరంలో విద్యుత్ వైర్లు నేటికీ వేలాడుతూనే ఉన్నాయి. దీంతో నివాసుల్లో భయాందోళనలు ఎక్కువయ్యాయి. భూగర్భ విద్యుత్ లైన్ల కనెక్షన్ల పనులు నత్తనడకన సాగుతుండటం, సక్రమంగా జరగకపోవడంతో నగర ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. భూగర్భ విద్యుత్ పనుల కోసం తవ్విన గోతులతో ఇబ్బందులు పడే వారు కొందరైతే.. భూగర్భ విద్యుత్ లైన్ల వ్యవస్థ అందుబాటులోకి రాక వేలాడుతున్న కరెంట్ తీగలతో కలవర పడే వారు మరి కొందరు. నియోజకవర్గ పరిధిలోని పలు వార్డుల దుస్థితి మరీ దయనీయంగా ఉంటోంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అన్న భయాందోళనలతో స్థానికులు సతమతమవుతున్నారు. ఇంటిని ఆనుకొని విద్యుత్ తీగలు ఉండటంతో ఎప్పుడు షాకిస్తుందోనన్న భయం గుప్పిట్లో జీవిస్తున్నారు. ఇంటి మేడలపై దుస్తులు ఆరేసుకునే సమ యంలో షాక్‌కు గురవుతామోననే భయంతో మహిళలు బిక్కుబిక్కుమంటున్నారు. వర్షా కాలంలో పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. బలమైన గాలులు వీచే సమయంలో విద్యుత్ తీగలు ఎప్పుడు తెగిపడతాయోనన్న భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

పరిమితికి మించి కనెక్షన్లు..

నియోజకవర్గంలోని 29 వార్డు నుంచి 39 వార్డుల వరకు పరిస్థితి దారుణంగా ఉంది. ఒక్కో విద్యుత్ పోల్‌కు పరిమితికి మించి కనెక్షన్లు ఉండటంతో పిచ్చుక గూళ్లను తలపిస్తున్నాయి. 30, 37 వార్డుల్లో అయితే ఒక్కో విద్యుత్ పోల్‌కు 40 కనెక్షన్లు కన్నా ఎక్కువగానే ఉన్నాయి. రెల్లి వీధి, పెయిన్‌దొరపేట, చెంగల్రావుపేట, కోట వీధి, అంబుసరంగు వీధి, కోడిపంద్యాల వీధి, ఏవీఎన్ కాలేజ్ డౌన్, మత్స్యకార పల్లెలు, వెలంపేట, పూర్ణామార్కెట్, ప్రసాద్ గార్డెన్స్, అల్లిపురం, కొబ్బరితోట, గొడారిగోతులు, పండా వీధి, లక్ష్మీనగర్, అంబేడ్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో ఒక్కో కరెంట్ స్తంభానికి అధికంగా కనెక్షన్లు ఉండటంతో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయి. 35వ వార్డు పరిధి కల్లుపాకలు ప్రాంతంలో విద్యుత్ తీగల కనెక్షన్లు గృహాలపై నుంచే ఉన్నాయి. దక్షిణ నియోజకవర్గం పాతనగరం కావడంతో ఎప్పటి నుంచో తరలుగా ఉన్నవారు ఎక్కడికి వెళ్లలేక ఈ ప్రాంతంలోనే స్థానికంగా ఉండిపోవడం.. ప్రధాన కంపెనీలు, హాస్పిటల్స్, ప్రభుత్వ కార్యాలయాలు, షాపింగ్ మాల్స్ ఎక్కువగా ఉండటంతో ఉద్యోగ, వ్యాపారాల కోసం ఎక్కడెక్కడి నుంచో వచ్చి ఇక్కడ స్థిరపడేవారితో నగరం ఇరుకు ప్రాంతం కావడం, పక్క పక్కనే పెద్ద భవంతులు నిర్మించుకోవడంతో విద్యుత్ కనెక్షన్లు ఇంటి గోడలకు ఆనుకొని ఉంటున్నాయి. గల్లీల్లో అల్యూమినియం బ్లాక్ కేబుల్ వాడాలని, అప్పుడు ప్రమాదాలకు ఆస్కారం ఉండదని పలువురు సూచిస్తున్నారు. ఈ సమస్యపై ఉన్నతాధికారులు దృష్టి సారించి పరిష్కరించాలని ఆయా ప్రాంతాలవాసులు కోరుతున్నారు.

నాలుగేళ్ల సంక్షేమ పాలన సంబరాలు



వెంకటేశ్వరమెట్ట సచివాలయంలో కేక్ కట్‌చేస్తున్న రంధి గోపికృష్ణ తదితరులు

అల్లిపురం: రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం సంబరాలు నిర్వహించారు. వెంకటేశ్వరమెట్ట–1 సచివాలయంలో పార్టీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్ల సమక్షంలో వైఎస్సార్‌సీపీ 33వ వార్డు అధ్యక్షుడు రంధి గోపికృష్ణ కేక్ కట్‌చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల సంక్షేమ పాలనను దిగ్విజయంగా పూర్తి చేసుకున్నారన్నారు. ఈ నాలుగేళ్లలో 98 శాతం హామీలను పూర్తి చేసిన ఘనత ఆయనకే దక్కుతుందన్నారు. అధికారంలోకి రాగానే సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి, వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందించారన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలని కోరుకుంటున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు భీశెట్టి రాజు, పిల్లి శివ, పల్లికల శివ, వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు, కన్వీనర్లు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు విలువైనవి



వలంటీర్ల సమక్షంలో కేక్ కట్‌చేస్తున్న కార్పొరేటర్ తోట పద్మావతి

అల్లిపురం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియమించిన వార్డు వలంటీర్ల సేవలు విలువైనవని 34వ వార్డు కార్పొరేటర్ తోట పద్మావతి అన్నారు. భూపేష్‌నగర్, కొబ్బరితోట సచివాలయాల్లో కొందరు వలంటీర్లకు ఇటీవల సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర అవార్డులను ప్రకటించారు. సేవా మిత్ర అందుకున్న ప్రతి వలంటీర్‌ను బుధవారం ఆమె సత్కరించి, అభినందించారు. ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పనిచేస్తున్న వలంటీర్ల సేవ నిరుపమానమని కొనియాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా కార్పొరేటర్ పద్మావతి కేక్ కట్‌చేసి వలంటీర్లకు శుభాకాంక్షలు తెలిపారు. నాలుగేళ్లుగా ప్రజలకు సంక్షేమ పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌కు ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో వార్డు జేసీజే ఇన్‌చార్జి కర్రి నీలకంఠం, పార్టీ సీనియర్ నాయకులు లండా రమణ, తాతబ్బాయి, యల్లమ్మ, గోవింద్, భాస్కరరావు, వేచలపు రాజు, సచివాలయం అడ్మిన్ భవాని, కార్యదర్శులు, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

అత్యవసర పనులకు ప్రాధాన్యం



జీవీఎంసీ కమిషనర్‌కు సాయికాంత్ వర్మకు శివాజీ పార్కు సమస్యలు వివరిస్తున్న వాకర్స్



బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్ పనులు పరిశీలించి అధికారులకు ఆదేశాలిస్తున్న కమిషనర్

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

డాబాగార్డెన్స్: నగరంలో అత్యవసర పనులకు ప్రాధాన్యమిస్తున్నట్టు జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పేర్కొన్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం జోన్–3, 5ల్లోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. కైలాసపురం, సాలిగ్రామపురం, డీఎల్బీ క్వార్టర్స్, అయ్యప్పనగర్, శ్రీనివాస నగర్, ఏఎస్సార్ నగర్, మురళీనగర్, మాధవధార తోపాటు శివాజీ పార్కు, బీచ్ రోడ్డులోని స్విమింగ్ పూల్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన రహదారులతోపాటు వీధి రోడ్లలో పారిశుధ్య పనులు పక్కాగా జరగాలన్నారు. చాలా చోట్ల వీధులు, రహదారులపై వ్యర్థాలు కనిపిస్తున్నాయని, ఆయా సచివాలయ పరిధిలోని శానిటరీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టి సారించి చెత్త కుప్పలు ఎప్పటికప్పుడు తొలగించాలని ఆదేశించారు.

శివాజీ పార్కు సందర్శన..

శివాజీ పార్కును కమిషనర్ సాయికాంత్ వర్మ సందర్శించారు. మరుగుదొడ్లు, నడక మార్గం, తాగునీరు, విద్యుత్ సమస్యలున్నాయని, వాటిని పరిష్కరించాలని ఆయనను వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కోరారు. కమిషనర్ స్పందిస్తూ అత్యవసర పనులు త్వరితగతిన చేపట్టేందుకు టెండర్లు పిలవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్‌ను సందర్శించి పనులు పరిశీలించారు. 70 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలినవి త్వరగా చేపట్టి, ప్రజలకు అందుబాటులోకి తేవాలని, స్విమ్మింగ్ సామగ్రి అంతా సమకూర్చుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పర్యటనలో జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, డీడీహెచ్ దామోదరరావు, పర్యవేక్షక ఇంజినీర్ వినయ్‌కుమార్, కార్యనిర్వాహక ఇంజినీర్ సుధాకర్, అసిస్టెంట్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పథంలో 36వ వార్డు

రూ.1.42 కోట్లతో వివిధ పనులకు ఎమ్మెల్యే వాసుపల్లి భూమిపూజ



కార్పొరేటర్ మేరీజోన్స్‌తో కలిసి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 36వ వార్డులో రూ.కోటి 42 లక్షలతో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ బుధవారం శ్రీకారం చుట్టారు. ముందుగా వార్డులోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో భారీ అభివృద్ధి పనులకు చిరునామాగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిలుస్తోందన్నారు. 36వ వార్డులో ఒకేసారి అభివృద్ధి పనులకు రూ.కోటి 42 లక్షలు మంజూరు చేయించి వార్డుని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నందుకు మేయర్ గొలగాని హరి వెంకటకుమారి కార్పొరేటర్ మాసిపోగు మేరీ జోన్స్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఇవీ పనులు..

రూ.58 లక్షలతో రంగిరీజువీధి అరుంధతి సేవా సమాజం జీ+2 తరహాలో కమ్యూనిటీ భవనం ఏర్పాటుకు, ఫస్ట్ ఫ్లోర్‌లో మహిళలకు కుట్టు శిక్షణ కేంద్రం, సెకండ్ ఫ్లోర్‌లో స్థానికుల శుభకార్యాలు నిర్వహించేందుకు, రూ.36 లక్షలతో రంగిరీజు వీధిలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు, రూ.24 లక్షలతో బాబాజీ కొండపై సీసీ రోడ్లు, డ్రెయిన్లు, రూ.11 లక్షలతో శాలీల దిబ్బ ఎంట్రన్స్ ఆర్చ్, రూ.13 లక్షలతో శాలీల దిబ్బలో పలు పనులకు కార్పొరేటర్ మేరీజోన్స్‌తో కలిసి ఎమ్మెల్యే వాసుపల్లి భూమిపూజ చేశారు. టీడీపీ హయాంలో అభివృద్ధి కుంటుపడి, వార్డు ప్రజలకు ఎటువంటి ప్రయోజనాలు సమకూరలేదన్నారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి జనరంజక పాలన అందిస్తున్న సీఎం వైఎస్ జగన్‌ను 2024 ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ మేరీజోన్స్ మాట్లాడుతూ ఎన్ని దుష్ప్రచారాలు చేసినా.. టీడీపీ అధికారంలోకి రావడం కలలో కూడా జరగదన్నారు. అభివృద్ధి పనుల విషయంలో సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు మాసిపోగు రాజు, రమణమ్మ, రమణి, కాకి పద్మ, కుందేటి సుధాకర్, ధనాల రాంబాబు, శ్రీనివాస్, వంగళపూడి శ్రీనివాస్, చెన్నా శ్రీధర్, రాజు, కిషోర్, రత్నం సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మట్టి బొమ్మల తయారీపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఆర్పీ అరుణ, శిబిరాన్ని పరిశీలిస్తున్న వెంకటరావు

డాబాగార్డెన్స్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు మట్టి బొమ్మల తయారీపై రిసోర్స్ పర్సన్ అరుణకుమారి అవగాహన కల్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఆర్‌సీహెచ్ వెంకటరావు శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పిల్లలు రోజూ లైబ్రరీకి వచ్చి, ఏ విధంగా సమ్మర్ క్యాంపును వినియోగించుకుంటున్నారో అడిగి తెలుసుకున్నారు. ప్రతి రోజూ ఏ పుస్తకాలు ఎక్కువగా చదువుతున్నారో తెలుసుకుని సూచనలిచ్చారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ ఎల్.రాజేంద్రవర్మ, సిబ్బంది అరుణకుమారి, జ్యోతి, పాఠకులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై..

రంగిరీజు వీధిలోని బాలల శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో పాల్గొన్న పిల్లలకు వార్డు హెల్త్ సెక్రటరీ కె.నూకరత్నం వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత, న్యూట్రిషన్ ప్రాముఖ్యత, ప్రతి రోజూ తీసుకోవల్సిన ఆహార పదార్థాలపై అవగాహన కల్పించారు. నులిపురుగుల కార్యక్రమం గురించి వివరించారు. విద్యార్థులకు మలేరియా, బ్లడ్, హెచ్‌బీ టెస్టులు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి టి.పోలితల్లి, ఆశా వర్కర్ బి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

28న 'ఘంటసాల జీవిత చరిత్ర' నాటకం

డాబాగార్డెన్స్: భారతదేశ నాటక రంగ చరిత్రలో తొలి నాటక గ్రంథాలయానికి శాశ్వత నిధుల కోసం రంగసాయి నాటక సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 28న ఘంటసాల జీవిత చరిత్ర నాటకాన్ని ప్రదర్శించనున్నట్టు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు బాదంగీర్ సాయి తెలిపారు. వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో బుధవా రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కార్యక్రమ వివరాలు వెల్లడించారు. శ్రీభాస్కరుని సత్య జగదీష్ దర్శకత్వంలో ఆ రోజు సాయంత్రం కళాభారతి ఆడిటోరియం వేదికగా ఈ నాటకం ప్రదర్శించనున్నట్టు చెప్పారు. సాయంత్రం 5 గంటలకు, రాత్రి 7.30 గంట లకు వరుసగా రెండు ప్రదర్శనలు ఉంటాయని, ప్రదర్శనలకు రూ.300, రూ.200, రూ.100 డోనర్ పాసులు కళాభారతిలోనూ, రంగసాయి నాటక గ్రంథా లయం, సాయి బాదంగీర్ సెంటర్ వద్ద అందుబాటులో ఉంటాయని పేర్కొ న్నారు. వివరాల కు 94404 58458 నంబర్ లో సంప్రదించవచ్చన్నారు. సమావేశంలో సీనియర్ పాత్రికేయు డు ఎస్.నాగేశ్వరరావు, చంద్రశేఖర్, కుమార్‌రాజు, చినబాబు పాల్గొన్నారు.

27న పెయింటింగ్ పోటీలు

సీతంపేట: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాల సెమినార్ హాల్లో పెయింటింగ్ పోటీలు నిర్వహిస్తున్నట్టు ఇండియా యూత్ ఫర్ సొసైటీ ప్రతినిధి అప్పలరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 'బీచ్ ప్లాస్టిక్ పొల్యూషన్' అనే అంశంపై శనివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పోటీలు జరుగుతాయన్నారు. 7 నుంచి 12 ఏళ్లు, 13 నుంచి 15 ఏళ్ల వయసు వారికి వేర్వేరుగా పోటీలు ఉంటాయని వివరించారు. రెండు విభాగాలకు వేర్వేరుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.3 వేలు, రూ.2వేలు, వెయ్యి రూపాయలు అందజేయనున్నట్టు తెలిపారు. ఆసక్తి గల వారు 81214 81452 నంబర్‌లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య కేంద్రాలను సందర్శించిన డీఎంహెచ్‌వో



అల్లిపురం ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జ్ఞానాపురం, అల్లిపురం ప్రాంతాల్లోని డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, భీమ్ నగర్ అంగన్‌వాడీ సెంటర్‌ను బుధవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో సమీక్షించారు. అల్లిపురం ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. వేసవిలో సాధ్యమైనంత త్వరగా ఉదయాన్నే వ్యాక్సినేషన్ అయ్యేటట్లు ప్రణాళిక వేసుకోవాలని ఆయన సూచించారు. యూపీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది తమ విధులను సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. వివిధ పథకాల మీద సర్వే, గర్భిణులను గుర్తించి టి.టి. అందజేయాలని, బర్త్ ప్లానింగ్ గురించి, హైరిస్క్ గర్భిణులను గుర్తించి డాక్టర్స్ సలహా నిమిత్తం ఐరన్ ఫోలిక్ మాత్రలు, పోషకాహారం తీసుకునేటట్లు ప్రోత్సహించాలని కోరారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం గురించి అందరికీ తెలియచేయాలన్నారు. ఆరోగ్య కేంద్రాల వైద్యులు, ఆరోగ్య సిబ్బందికి జగదీశ్వరరావు సూచనలిచ్చారు. భీమ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో మెనూ ప్రకారం పౌష్టికాహారం అందజేయాలని సూచించారు.

నేడు సహస్ర తులసీదళార్చన

డాబాగార్డెన్స్: బురుజుపేట కనకమహాలక్ష్మి దేవాలయంలో ప్రతి గురువారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసీదళార్చన నిర్వహించనున్నారు. రూ.1,500 పూజా రుసుం చెల్లించి భక్తులు పాల్గొనవచ్చు. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806091లో రుసుం చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు ట్రాన్సక్షన్ వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను 89855 15989 నంబర్‌కు వాట్సాప్ చేయాలి.


కర్రసాములో విశాఖ చిన్నారుల ప్రతిభ



కర్రసాము పోటీల్లో పతకాలు సాధించిన విశాఖ వ్యాలీ స్కూల్ విద్యార్థులు

డాబాగార్డెన్స్: కర్రసాము పోటీలో విశాఖ చిన్నారులు ప్రతిభ చూపారు. ఈ నెల 21 నుంచి మూడు రోజుల పాటు చెన్నై కోయింబత్తూరులో సిలంబమ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి పోటీల్లో విశాఖ వ్యాలీ స్కూల్ విద్యార్థులు సత్తా చాటారు. కె.కుశ్వంత్‌కుమార్ బంగారు పతకం, కె.సుప్రియ, ఎస్.వినయ్ ఈశ్వర్, ఎ.లక్ష్మీనారాయణ బ్రాంజ్ మెడల్స్ సాధించారు. కోచ్ ఎస్.శ్రీనివాసరావు వద్ద తర్ఫీదు పొందిన వీరంతా ఇప్పటి వరకు పలు పతకాలు గెలుపొందారు. త్వరలో విశాఖలో జరగనున్న అంతర్జాతీయ పోటీల్లో పాల్గొంటున్నట్టు శ్రీనివాసరావు తెలిపారు. కర్రసాముకు పుట్టినిల్లు చెన్నైలోనే మన రాష్ట్రం విశాఖ నుంచి పలువురు విద్యార్థులు పాల్గొని విజయం సాధించడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బుధవారం స్కూల్‌లో నిర్వహించిన అభినందన సభలో పతకాలు సాధించిన చిన్నారులను ఆంధ్రప్రదేశ్ మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అల్లిపిల్లి ఎల్లాజీ అభినందించారు.

ప్రధాన కాలువల శుభ్రతకు చర్యలు



పందుపుల్లల సందులో కాలువ శుభ్రతపై సూచనలిస్తున్న ఏఎంహెచ్‌వో కిశోర్

జగదాంబ: రానున్న వర్షా కాలం నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా ప్రధాన కాలువలను పరిశుభ్రం చేయాలని సిబ్బందికి జీవీఎంసీ జోన్–4 ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎన్.కిశోర్ సూచించారు. 39వ వార్డు పందుపుల్లల సందులో ఉన్న ప్రధాన కాలువను బుధవారం ఆయన పరిశీలించారు. 8 అడుగుల వెడల్పు, 14 అడుగుల వెడల్పు ఉండే ఈ కాలువ ద్వారా కేజీహెచ్, ఏవీఎన్ కళాశాల డౌన్ నుంచి వచ్చే మురుగు నీరు ప్రవహిస్తుందన్నారు. అతి వేగంగా ప్రవహించే ఈ కాలువలో ఏదైనా అడ్డు పడితే పూర్ణామార్కెట్‌కు వద్ద వన్ వే రహదారి అంతా మురుగు నీటితో అపరిశుభ్రంగా ఉంటుందన్నారు. దీని వల్ల ప్రజలు, వ్యాపారులు ఇబ్బందులకు గురవుతారన్నారు. కాలువలను ముందుగానే శుభ్రం చేసుకుని ఉంటే మురుగు ప్రవాహానికి అడ్డు లేకుండా ఉంటుందన్నారు. కాలువల్లో ప్లాస్టిక్ బాటిళ్లు, ఇతర వ్యర్థాలు తొలగించి శుభ్రం చేయాలని ఏఎంహెచ్‌వో ఆదేశించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌వైజర్ కిశోర్, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ సందర్శన



కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో సీపీ త్రివిక్రమ్ వర్మ

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్‌ను బుధవారం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ త్రివిక్రమ్ వర్మ సందర్శించారు. సీపీగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా ఆయన ఈ స్టేషన్‌ను సందర్శించి పలు ఫైళ్లను పరిశీలించారు. మహిళలు, వృద్ధులు పిల్లలకు సంబంధించిన కేసులపై వచ్చిన ఫిర్యాదులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించాలని సూచించారు. వివిధ నేరాల్లో అరెస్టు కాకుండా తప్పించుకుని తిరుగుతున్న వారిపై నిఘా పెట్టాలన్నారు. పోలీస్ స్టేషన్ సందర్శించిన అనంతరం సంతృప్తి వ్యక్తం చేశారు. సీపీ వెంట డీసీపీ–2 ఆనందరెడ్డి, వెస్ట్ ఏసీపీ అన్నెపు నరసింహమూర్తి, సీఐ ఎస్.విజయ్‌కుమార్, ఎస్ఐలు ఉన్నారు.

అలరించిన కథా కచేరి



మాట్లాడుతున్న రచయిత శేఖరమంత్రి ప్రభాకర్

సీతంపేట: సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్ర నగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో జరిగిన కథా కచేరి అందరినీ అలరించింది. ముందుగా ఇటీవల పరమపదించిన ప్రముఖ రచయిత కేతు విశ్వనాథ రెడ్డి మృతికి సంతాపంగా మౌనం పాటించారు. సభకు అధ్యక్షత వహించిన రచయిత శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ రచయితలు మానవ జీవన మనస్తత్వాలు మానవీయ విలువలు, కథల్లో చూపించి ఉదాత్తమైన రచనా శైలితో కథలు అందించాలని సూచించారు. రచయితలు తమ రచనల ద్వారా సమాజంలో చెడును ప్రక్షాళన చేయాలన్నారు. రచయిత కె.జి.వేణు ప్రముఖ రచయిత ద్విభాష్యం రాజేశ్వరరావు రచించిన 'వర్షం కురిసిన రాత్రి' కథానికను చక్కగా విశ్లేషించారు. రచయితలు మేడా మస్తాన్‌రెడ్డి, భాగవతుల సత్యనారాయణమూర్తి, చిన్న సూర్యనారాయణ, కె.వి.ఎస్.మూర్తి, కొత్తూరి రమణ, రామతాత, కుప్పిలి భీమేశ్వరరావు తదితరులు తమ రచనలు వినిపించారు.